




గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 1200 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# శతాబ్దాల తెలుగు పత్రికలు తీరుతెన్నులు

-7-

ఈ భాగంలో 1940-50 మధ్యలో ప్రారంభమైన కొన్ని పత్రికల వివరాలు తెలుసుకుందాం. ముందుగా ఒక ఆసక్తికరమైన పత్రికను పరిచయం చేస్తాను. ఆ పత్రిక పేరు “హైదరాబాదు సమాచారము”. ఈ తెలుగు పత్రిక 1940 నుంచి 5,6 సంవత్సరాల పాటు కొనసాగినట్లుగా తెలుస్తోంది. ప్రతి సంచికా 25,30 పేజీలతో వెలువడేది. 1940 కాలమంటే నైజాం ప్రభుత్వంలో ఉర్దూ భాషకు తప్ప తెలుగు భాషకు అంత ఆదరణ లేదనీ, తెలంగాణాలో తెలుగు పత్రికల గురించి మాట్లాడుకున్నప్పుడు తెలుసుకున్నాం. ఆశ్చర్యకరంగా నైజాం ప్రభుత్వపు అధికార పత్రిక ఈ హైదరాబాదు సమాచారము పత్రిక తెలుగులో వచ్చింది. దీన్ని ప్రచురించింది “ఆఫీసు ఆఫ్ ది డైరెక్టర్ , ఇన్ఫర్మేషన్ బ్యూరో H.E. H the నైజామ్స్ గవర్మెంట్ , హైదరాబాద్.

అధికార పత్రిక కాబట్టి దీన్నిండా నిజాం ప్రభుత్వానికి సంబంధించిన వార్తలే వున్నాయి. నైజం రాజ్యం లోని సంక్షేమ కార్యక్రమాలూ, ఉస్మానియా యూనివర్సిటీ కబుర్లూ. అది రెండో ప్రపంచ యుద్ధ సమయం కాబట్టి, ఆ

వాతావరణంలో నిజాం ప్రభుత్వంలో వివిధ విభాగాలు ఎలా పనిచేస్తున్నాయి. అనే వివరాలు ఎక్కువగా వున్నాయి. తెలంగాణా లోని వివిధ జిల్లాల వార్తలు కూడా వున్నాయి. ఈ హైదరాబాదు సమాచారం తెలుగు పత్రికలో నేను గమనించిన కొన్ని ఆసక్తికరమైన వార్తలు చెబుతాను.1941 డిసెంబర్ లో ఒక వార్త వచ్చింది.

భిక్షా వృత్తి అంతమొందుట –

"హైదరాబాదు లో భిక్షా వృత్తి నివారణా చట్టముతో నిజాం రాజ్యంలో విశేషంగా ప్రబలి యున్న యాచక వృత్తిని నివారించుటకై తగు యత్నములు చేయబడుచున్నవి. ఈ చట్ట నిర్మాతలగు న్యాయ, మత శాఖలకు మంత్రియగు గౌ: సయ్యద్ అబ్దుల్ అజీజ్ గారు ప్రజా నాయకులందరితోనూ ఈ చట్టమును సఫలముగా కార్య రూపమున పెట్టుటకై సలహా పడుచున్నారు. ప్రతినిధుల సంఘము ఈ విషయమును గురించి సమాలోచన చేయుచున్నది, దీనిని అనుసరించి ఆయా ప్రాంతములయందు ప్రాంతీయ సంఘములు ఈ సమస్యా పరిష్కారములు కనుగొనును"

మొత్తంగా చెప్పింది ఏమిటంటే, వివిధ ప్రదేశాల్లో స్థానిక సంఘాల్లాటివి ఏర్పాటు చేస్తారు. అవన్నీ కలిసి మునిసిపాలిటీలో ఉన్నటువంటి సంఘానికి రిపోర్టు చేస్తూ ఉంటాయి. ఈ సంఘాలన్నీ కూడా స్థానికంగా వున్న బిచ్చ గాళ్ళ నందరినీ ఒక చోట చేర్చి, వాళ్లకు కళల యందూ, చేతి పనుల యందూ, కోళ్ల పెంపకం నందూ ఇంకా ఇతర వృత్తులయందు శిక్షణ నొసగబడును. సుశిక్షితులైన పిమ్మట వారు కొద్ది పెట్టుబడితో ఏదైనా వృత్తిని సాగించుకొని జీవించగలరు. ఈ ప్రణాళిక ఒకేసారి అంతా మార్చేయడానికి కాదు. నెమ్మది నెమ్మదిగా ఒక్కొక్క గ్రామంలో మొదలు పెట్టి, తరువాత మునిసిపాలిటీ లోనూ ఇలా.. ఇలా.. బాగుచేస్తాము. అలా భిక్షక వృత్తిని అంతం చేస్తాము." అని ఈ పత్రిక లో 1941 లో రాసారు.

అంటే, ఈ "భిక్షుక వృత్తి" అనే దాన్ని ఒక సామజిక సమస్యగా గుర్తించి, దాని నివారణ కోసం, ప్రణాళికలు ఆలోచించడం, దాని నివారణకు ఒక పథకాన్ని రూపొందించడం, ఆ రోజుల్లోనే అంటే, 1941 లోనే ఇవన్నీ జరగడం ఆసక్తికరమే కాదు. ఆశ్చర్యం. అభినందనీయం కూడా. మరి ఇంత స్పష్టంగా ఆలోచనలు కొనసాగినప్పటికీ, తరువాత దశాబ్దాలలో ఇలాంటి ప్రణాళికలు ఏమయ్యాయి?ఈ వార్త వచ్చిన 80 ఏళ్ళ తర్వాత కూడా భిక్షుక వృత్తి అనే సమస్య అలాగే ఎందుకు ఉండిపోయింది. అనేది మన పరిధిలో లేని చర్చ. కానీ, ఆలోచించదగ్గ విషయం. విశ్లేషించ దగ్గ విషయం.

ఇదే పత్రికలో మరొక వార్త. 1945 లో వచ్చింది.

"ఒక్క దినములో గృహ నిర్మాణము"

ఆధునికమై, అన్ని వసతులూ గల ఇల్లు ఒక్క దినములో కట్ట వచ్చుననియూ, దానికి 300 రూపాయలు మాత్రమే వ్యయము అగునని నీవు నమ్మగలవా?వినగానే మొట్ట మొదట నీకు అపనమ్మకం జనించును. లేదా ఇట్టి



కౌ

కార్యము అభూత శక్తితో జరపబడు ఒక గారడీ పనియని తలతువు. అట్లు ఏమాత్రమూ తలపవద్దు. ముల్కీ పారిశ్రామిక ప్రదర్శనమునకు వచ్చిన వేల ప్రేక్షకులకు ఇట్టి పని మానవ శక్తికి సాధ్యమగునని ప్రయోగము మూలముగా చూపబడినది, క్రిందటి సంవత్సరము ప్రదర్శింపబడిన వస్తువులలో ఇట్టి సిమ్మెంటు కాంక్రీట్ కట్టడం ఒకటి ఆకర్షక విషయము. దీనిని త్వరగా కట్టుటకునూ, చివరికి పేదవానికి అన్ని వసతులు గల గృహముగా, అనేకులు కన్నులారా గాంచిరి. అట్టి దానిని ఊహించి కట్టు గౌరవము హైదరాబాదు శాఖ వారికీ చెందినది. కొన్ని సంవత్సరముల క్రిందట సుందరమొనర్చు ఉద్దేశ్యముతో నగర అభివృద్ధి శాఖ ఏర్పాటు చేయబడినది. " అని ఒక్క ఇల్లు కట్టడం ఎలాగూ?అని వివరంగా చెప్పారు. ఎట్లాగంటే?

"ఇది సామాన్య సిమ్మెంటు కంకర ఇల్లు. దీనిలో ఒక గది. ఒక వంట ఇల్లు. ఒక వరండా యుండును. గోడలూ, కప్పూ, అన్ని సిమ్మెంటు కంకరయే. ఒక అడుగు పునాది చాలును. 24 గంటలు శ్రమపడిన యెడల నిర్మాణము పూర్తి యగును. మరొక 18 దినములలో ఇల్లు గట్టి పడును. " ఇంత వివరంగా రాసారు, ఒక్క రోజులో ఇల్లు కట్టడం ఎలాగా అని. మొత్తం గోడలూ, కప్పూ అంతా సిమ్మెంటు తోటే. అని 1945 లో అక్కడ జరిగిన ఎగ్జిబిషన్ లో ఒక ఇల్లు కట్టి చూపించి, ఇలాంటి ఇళ్ళు హైదరాబాదు లో వున్న సామాన్యులందరికీ కడతాము " అని ఈ హైదరాబాదు సమాచారం పత్రికలో రాసారు.

ఇంకో ఆసక్తి ప్రకటన ఏమిటంటే, సాధారణంగా ఏ పత్రికలోనైనా వార్తలు వస్తే, ఇందులో వార్తలు ఎవరూ కూడా కాపీ చెయ్యకూడదు. కాపీ రైట్ చట్టము ఇలాంటివి ఉంటాయి కదా ! ఈ పత్రికలో ఏం రాసారంటే..

"ఈ పత్రికయందలి విషయములను స్వేచ్ఛగా ఎత్తి వ్రాసికొనవచ్చును"

ఇందులో వచ్చినటువంటి విషయాలు ఎవరైనా, ఎప్పుడైనా కాపీ చేసుకోవచ్చు. అని రాసారు.

అలాగే, ఈ హైదరాబాదు సమాచారం పత్రిక కోసమని ప్రకటనలు ఇవ్వండి. అని చెబుతూ 1945 లో ఇలా ఇచ్చారు ఏడ్వటైజ్ మెంట్

"హైదరాబాదు సమాచారము లో మీ ప్రకటనలనిచ్చి, నైజం రాజ్యములో మీ అమ్మకములను రెండింతలు చేసికొనుడు. వివరములు క్రింది అడ్రస్ నాకు వ్రాయుడు.

ది డైరెక్టర్, హెచ్. ఇ. హెచ్ . ది నిజామ్స్, ఇన్ఫర్ మేషన్ బ్యూరో, హైదరాబాదు, దక్కన్. ఇది అందులో వచ్చి నటు వంటి ఒక ప్రకటన. ఇవండీ "హైదరాబాదు సమాచారము "అనే పత్రికలోని కొన్ని విశేషాలు.

★★★

తరువాత 1940 ప్రాంతాల్లో ప్రారంభం అయిన కమ్యూనిస్ట్ పత్రికల విశేషాలు. కమ్యూనిస్ట్ పార్టీ ప్రారంభం, ఆంధ్ర ప్రాంతాల్లో దాని యొక్క ప్రాబల్యం. అది విస్తరించడం ఆ వివరాల్లోకి వెళితే, 1933 –34 ప్రాంతాల్లో ఆంధ్ర

ప్రాంతాల్లో కమ్యూనిస్ట్ ఉద్యమం ప్రారంభమయింది. కార్ల్ మార్క్స్, ఏంగెల్స్ రాసిన కమ్యూనిస్ట్ మేనిఫెస్టోని ఆ సంవత్సరాల్లోనే పుచ్చలపల్లి సుందరయ్య గారు తెలుగులోకి అనువాదం చేసి, కమ్యూనిస్ట్ కరపత్రం అనే పేరుతో దాన్ని విడుదల చేశారు. దాని సహాయంతో కమ్యూనిస్ట్ కార్యకర్తలకి పాఠాలు కూడా చెప్పారు.

అలాంటి ఉద్యమం 1937 నాటికి ఆంధ్ర రాష్ట్రము అంతా వేళ్ళు పూనుకుంది. అప్పట్లో స్వాతంత్రం తీసుకురావడానికని ప్రయత్నించే వాళ్ళు రెండు విధాలుగా వుండేవాళ్ళు. ఒకరు గాంధీగారి యొక్క మిత వాద పద్ధతిని పాటించి, సత్యాగ్రహం ద్వారా బ్రిటీష్ వాళ్ళను వెళ్ళగొడదాం అనుకొనే వాళ్ళు. మరికొందరు,సుభాష్ చంద్ర బోస్ లాగా "కత్తికి కత్తి. తుపాకీకి తుపాకీ అన్నట్లుగా పోరాడాలి." అని అతి వాద భావాలతో వుండేవాళ్ళు.

ఈ అతివాద శక్తులు కమ్యూనిజం వైపు మొగ్గు చూపడం ప్రారంభించాయి. అలాగే కాంగ్రెస్ లో కూడా కొంతమంది లెఫ్టిస్టులు ఉండేవారు. వాళ్ళు కాంగ్రెస్ సోషలిస్టు అనే ఒక వర్గాన్ని స్థాపించారు. కమ్యూనిస్టులు కూడా అందులో ఒక భాగం లాగ ఉండేవారు. ఆలా కమ్యూనిస్ట్ పార్టీ, కాంగ్రెస్ సోషలిస్టుగా అంతర్గతంగా వున్నప్పుడు ఆ పార్టీ తరపున 1937 డిసెంబర్ 15 న మొట్ట మొదటిసారిగా రాజమండ్రి నుంచి "నవశక్తి" అనే వార పత్రిక మొదలయ్యింది. దేనికి సంపాదకత్వం వహించింది. "మద్దూరి అన్నపూర్ణయ్య గారు". కొంత కాలం రాజమండ్రి నుండి వచ్చాక , తరువాత బెజవాడ కు వచ్చింది.

ఇది పూర్తిగా కమ్యూనిస్ట్ పత్రిక అని చెప్పలేము. ఎందుకంటే, ఇంకా అప్పటికి కమ్యూనిస్ట్ కార్యకర్తలు ఇంకా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో ఒక భాగంగా వున్నారు. దీని తర్వాత సంపాదక వర్గం లోకి కంభంపాటి సత్యన్నారాయణ గారూ , పుచ్చలపల్లి సుందరయ్య గారూ, తుమ్మల వెంకటరామయ్య గారూ ఇలాంటి వాళ్ళు వచ్చి చేరారు. అప్పట్లో లెనిన్ చెప్పిన బోధనల ప్రకారం, "పార్టీ, ఏ పత్రిక పెట్టినా గానీ, అది ఒక ఉద్యమ నిర్మాణానికి ఉపయోగపడాలి" అని చెప్పారు. దాని ధ్యేయంతో, రెండవ ప్రపంచ యుద్ధం మొదలయ్యే వరకూ కూడా ఈ నవశక్తి వార పత్రిక పనిచేసింది. ఆ సంవత్సరాల్లోనే "త్రిపుర" సంచిక అనీ, రష్యా సంచిక అనీ, ప్రత్యేక సంచికలు కూడా ప్రచురించింది. ఈ నవశక్తి పత్రికలోనే శ్రీశ్రీ గారు రాసిన దేశ చరిత్రలు" "మాయంటావా? మిధ్య0టావా అంటే?"ఇలాంటి గేయాలన్నీ కూడా ప్రచురితమయ్యాయి.

రెండో ప్రపంచ యుద్ధం వచ్చే సమయంలో ఈ నవశక్తి వార పత్రికను నిషేధించాలి అని కాంగ్రెస్ ముఖ్యమంత్రి రాజగోపాచారి గారు ఆలోచిస్తున్నారు అని తెలిసి పుచ్చలపల్లి సుందరయ్య గారు ముందుగానే ఈ పత్రికను మూసేసారు. అది తెలిసి రాజగోపాచారిగారు అన్నారట. "సుందరయ్య నన్ను బోల్తా కొట్టించాడు"అని. ఆ విధంగా నవశక్తి పత్రిక 2,3 సంవత్సరాలు మాత్రమే నడచి ఆగిపోయింది.

మొట్ట మొదటి సరిగా కమ్యూనిస్ట్ పత్రిక అని చెప్పుకోదగినది కొద్ది సంవత్సరాల తర్వాత వచ్చింది.

అదెలా జరిగిందంటే, ఈ నవశక్తి పత్రికను ఆపేసాక కూడా దాంట్లో వ్యాసాలు రాసిన వాళ్ళందరి మీదా అరెస్ట్ వారెంట్లు ఇష్యూ చేశారు. అందువల్ల అప్పటి కమ్యూనిస్ట్ నాయకులు అజ్ఞాత వాసంలోకి వెళ్లిపోయారు. 1939–42 సంవత్సరాల్లో ఆ అజ్ఞాతంలో ఉన్న కమ్యూనిస్ట్ కార్యకర్తలు "స్వతంత్ర భారత్"అనే రహస్య పత్రికను నడిపారు. అది కూడా ప్రభుత్వానికి తెలియకుండా. ప్రభుత్వం ఊరుకోలేదు, చాలా ప్రయత్నాలు చేసింది ఆ పత్రికలు చదివేవాళ్ళని కూడా అరెస్టులు చేయడం లాంటివి చేసింది. కానీ, ఆ పత్రిక మూలాలు మాత్రం పట్టుకోలేకపోయింది. ఇవన్నీ జరిగాక 1942 లో కమ్యూనిస్ట్ నాయకులు చాలా మంది అజ్ఞాతవాసం నుండి బయటకు వచ్చారు. అప్పుడు 1942 జూన్ 17 న "ప్రజాశక్తి"అనే వార పత్రిక, కమ్యూనిస్ట్ వార పత్రికగా బెజవాడ నుండి మొదలయ్యింది. దీని సంపాదక వర్గంలో కాట్రగడ్డ రాజా గోపాలరావు గారూ, చలసాని వాసుదేవరావు గారూ, తుమ్మల వెంకటరామయ్య గారూ, కొండేపూడి లక్ష్మీ నారాయణగారూ వీళ్ళందరూ వున్నారు. ఇది కమ్యూనిస్ట్ పార్టీ ఆంధ్ర కమిటీ పత్రిక అని చెప్పుకోవచ్చు. కాకపోతే వార పత్రికగా ప్రారంభం అయింది.

ఈ వార పత్రికలో పనిచేసిన "మాధవపెద్ది గోఖలే" తరవాత రోజుల్లో ప్రముఖ సినీ కళా దర్శకుడు అయ్యారు. ఆయన వ్యంగ్య చిత్రాలూ, కథలూ కూడా రాస్తూండేవారు. ఈ ప్రజాశక్తి వార పత్రిక 3 సంవత్సరాలు పాటు వచ్చిన తర్వాత, "దాన్ని దినపత్రికగా మార్చాలి." అని పార్టీ నిర్ణయించింది. 1945 డిసెంబర్ 3 న ప్రజా శక్తి వార్తాపత్రికగా వున్నది దినపత్రికగా మారింది. అది 1948 ఏప్రిల్ 22 వరకూ వచ్చింది. అది వస్తున్న కాలం అంతా కూడా ప్రభుత్వం ఏం చేసిందంటే – ప్రజా శక్తి ఆఫీసు మీదా, కార్యకర్తల మీద దాడులు చెయ్యడం, అలాగే సంపాదక వర్గంలో వున్న వాళ్ళని అరెస్ట్ చెయ్యడం, ఇలాంటివన్నీ కూడా చాలా సార్లు జరిగాయి. చిట్ట చివరికి 1948 ఏప్రిల్ లో ఆ ప్రజాశక్తి ప్రెస్ మీద పోలీసులు దాడి చేసి, ఆ ప్రెస్ నీ, అక్కడ వున్న లైబ్రరీనీ పూర్తిగా ధ్వంసం చేశారు.

ఆ ధ్వంసం చేసినప్పుడు జరిగిన ఒక సంఘటనను తిరుమల రామచంద్ర గారు తన పుస్తకంలో ఇలా రాశారు. – బిట్రగుంట రామ చంద్రరావు అనే ఆయన ప్రజా శక్తి లో సబ్ –ఎడిటర్ గా పనిచేస్తుండేవాడు. ఆయన ఒక రోజు భోజనం చేస్తూ ఉండగా, పోలీసులు వాళ్ళ ఇంటి మీద దాడి జరిపి, వాళ్ళను అరెస్ట్ చేయడానికని వచ్చారు. వంటిట్లో కూర్చొని ఆయన భోజనం చేస్తున్నారు. వంటింట్లోకి వెళ్లి, అక్కడ ఉన్న వాటిని బూటు కాళ్లతో తొక్కి, లాఠీలతో, బిట్రగుంట చంద్రరావు గారిని కూడా కొట్టడం ప్రారంభించారు. ఆయన ఇంకా భోజనం చేస్తున్నారు. అప్పుడు ఆయన అన్నారట " వుండడయ్యా! పెరుగన్నం వదలొద్దని పెద్దలు అంటారు. ఈ పెరుగన్నం తిన్నాక నేను వస్తాను"అని. ఐనా వాళ్ళు వినకపోతే , ఎడమచెయ్యి వాళ్లకి ఇచ్చి, కుడి చేత్తో పెరుగన్నం పూర్తి చేసి, అప్పుడు వెళ్లి, ఆ పోలీసులకు సరెండర్ అయి, వాళ్ళతో పాటు వెళ్లారట. అలా ఆ దినపత్రిక 1948 ఏప్రిల్ 22 న ఆగిపోయింది.

మళ్ళా 4 సంవత్సరాలకి కమ్యూనిస్ట్ పార్టీ మీద నిషేధం తొలగిపోయాక, 1952 లో ఈ ప్రజాశక్తి వార పత్రికగానూ, వారానికి రెండు సార్లు వచ్చేది గానూ మొదలయ్యింది గానీ, అది కొద్ది నెలల్లోనే ఆగిపోయింది. దానికి కారణం కూడా ఏమిటంటే – 1952 లోనే "విశాలాంధ్ర"దినపత్రిక మొదలవ్వడం. అది తర్వాత తెలుసుకుందాం. అలా 1952 లో కొద్ది కాలం నడచి ఆగిపోయిన ప్రజాశక్తి వార పత్రిక , మళ్ళీ వార్తాపత్రికగానే 1968 లో పునః ప్రారంభం అయింది. 1968 కి గుర్తింపు ఏమిటంటే, 1964 లోనే కమ్యూనిస్ట్ పార్టీ రెండుగా చీలిపోయి, ఒకటి సిపిఐ , ఒకటి సిపిఎం అని ఏర్పడ్డాయి. ఆ సిపిఐ వాళ్లేమో "విశాలాంధ్ర"దినపత్రికను ప్రారంభించారు. ఆ సి. పి .ఎం వాళ్లకి వెంటనే పత్రిక ఏమీ లేదు. 68 లో ప్రజాశక్తి వార పత్రికను మళ్ళీ పునరుద్ధరించారు. దాన్ని కమ్యూనిస్ట్ మార్క్సిస్టు పార్టీ అధికార పత్రికగా నడిపారు. అది ఒక 13 సంవత్సరాల పాటు వార పత్రికగా కొనసాగి, 1981 ఆగస్టు 1 వ తేది నుండి దినపత్రికగా మారింది. అప్పటి నుండి ఇప్పటి వరకు.

ఈ ప్రజా శక్తి సంపాదకవర్గంలో పనిచేసిన కొంత మంది ప్రముఖులు కాట్రగడ్డ రాజగోపాలరావు గారూ, చలసాని వాసుదేవరావు గారూ, తుమ్మల వెంకట్రామయ్య గారూ, కొండే పూడి లక్ష్మి నారాయణ గారూ, మోటూరి హనుమంతరావు గారూ, తెలకపల్లి రవి గారూ.

అప్పట్లో వున్న చాలా దినపత్రికలు అవి రాజకీయ వార్తలకే ప్రాధాన్యం ఇచ్చినప్పటికీ, సంగీతం, సాహిత్యం ఇలాంటి కళలు సంబంధించిన వార్తలు వాటికి సంబంధించిన వ్యాసాలకు కూడా ప్రాముఖ్యతను ఇచ్చాయి. అదే కోవలో కందుకూరి, గురజాడ, గిడుగు లాంటి వారి రచనలు ప్రచురించడమే కాకుండా, వాళ్ళు ప్రారంభిన ఉద్యమాలకు కూడా ప్రాధాన్యతను ఇస్తూ వ్యాసాలను ప్రచురిస్తూ ఉండేవారు. అలాగే చిలకమర్తి, మాడపాటి హనుమంతరావు గారూ సురవరం ప్రతాపరెడ్డి గారూ, కొమర్రాజు లక్ష్మణరావు గారూ ఇలాంటి వాళ్ళ సంస్కరణ ఉద్యమాలను వాళ్ళ భావాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో ప్రముఖ పాత్ర వహించింది అని చెబుతుంటారు. అంటే, తెలుగుదేశంలో కమ్యూనిస్ట్ పార్టీ సిద్ధాంతాలతో పాటుగా సాహిత్యం , భాషా రంగాలకు సంబంధించిన ఉద్యమాలను కూడా ప్రోత్సహించింది ప్రజాశక్తి పత్రిక.

ఇంకా విశాలాంధ్ర పత్రిక విషయానికి వస్తే, 1948 లో కమ్యూనిస్టుల మీద నిషేధం విధించారు కదా.. 1952 లో ఆ నిషేధాన్ని ఎత్తేసాక 1953 జూన్ 22 వ తేదీన "విశాలాంధ్ర" దినపత్రికను ప్రారంభించారు. బెజవాడ నుండి ప్రారంభించిన తొలి సమగ్ర దినపత్రిక ఈ "విశాలాంధ్ర" అనుకోవచ్చు. ఎందుకంటే అంతకు ముందు వచ్చిన ప్రజాశక్తి వార పత్రికగా మొదలై, దినపత్రిక అయ్యింది. 1964 లో భారత కమ్యూనిస్ట్ పార్టీ చీలిపోయాక, సిపిఎం వాళ్ళు ప్రజాశక్తి. సిపిఐ వాళ్లు ఈ విశాలాంధ్ర తో ఇప్పటివరకూ కొనసాగుతూ వస్తోంది.

ఈ విశాలాంధ్ర దినపత్రిక కేవలం తమ పార్టీకి సంబంధించిన విషయాలే కాకుండా, సాహిత్యంలో విశేషమైన కృషి చేసింది. ఈ విశాలాంధ్ర లోని సారస్వతానుబంధం లోనూ, ఆదివారం వచ్చే ప్రత్యేక అనుబంధాల్లోనూ, కొడవటిగంటి కుటుంబరావు గారూ, కె. వి. రమణారెడ్డి గారూ లాంటి వాళ్ళు చిత్ర జగత్తు అనే శీర్షికనూ, అక్షర తూణీరం అని మరొక శీర్షికను నిర్వహించేవారు. అలాగే అట్లూరి పిచ్చేశ్వరావు గారు "కన్నవీ, విన్నవీ" అని ఒక శీర్షికను నిర్వహించారు. ఇంకా విశాలాంధ్ర అనుబంధంలో చాలా గొప్ప నవలలూ, గొప్ప అనువాద నవలలూ సీరియల్స్ గా వచ్చి, తరవాత పుస్తకాలుగా వచ్చాయి.

వాటిల్లో ముఖ్యమైనవి మహీధర రామ్మోహనరావు గారి రథ చక్రాలు, జ్వాలా తోరణం, ఉప్పల లక్ష్మణరావు గారి అతడు–ఆమెలో కొన్ని భాగాలూ. అట్లాగే అట్లూరి పిచ్చేశ్వరావు గారి గోదాన్ అనువాద నవల మొదలైనవి. ఆ కాలం లోని ప్రముఖులు శ్రీశ్రీ, ఆరుద్ర, కరుణశ్రీ, కుందుర్తి, సినారే, కాళోజీ, దాశరథి ..– ఇలాంటి వాళ్ళందరూ రాసిన కవితలు వస్తుండేవి.

విశాలాంధ్ర పత్రిక గురించి మాట్లాడుకునేటప్పుడు ఇంకొక విషయం మనం గుర్తు చేసుకోవాలి. 1948–52 మధ్యలో కమ్యూనిస్ట్ పార్టీ మీదా, పార్టీ కార్యకర్తల మీదా నిషేధం ఉండేదని తెలుసుకున్నాం కదా ! ఆ సంవత్సరాల్లో మద్రాస్ నుంచి "విశాలాంధ్ర" అనే పేరుతో శెట్టి ఈశ్వరావు గారి సంపాదకత్వంలో ఒక మాస పత్రిక, పక్ష పత్రిక వచ్చింది. అయితే, అది కమ్యూనిస్ట్ పత్రిక అని ఎక్కడా వ్రాయలేదు. ఎందుకంటే, అప్పుడు కమ్యూనిస్ట్ పార్టీ లేదు. అంటే నిషేధం కాబట్టి. ఈ విశాలాంధ్ర మాస, పక్ష పత్రిక సాహిత్య, సాంస్కృతిక పత్రిక అన్నట్లుగా 4 ఏళ్ళు నడచి, ఆగిపోయింది. ఆ తరువాత 1952 విశాలాంధ్ర దినపత్రిక మొదలయ్యింది అని చెప్పుకున్నాం కదా!

కమ్యూనిస్ట్ పత్రికల్ని మొత్తంగా సమీక్షించుకుంటే, 1940 ప్రాంతాల్లో ప్రారంభమైన సిపిఎం పత్రిక ప్రజాశక్తీ, సిపిఐ పత్రిక విశాలాంధ్రా.. ఈ రెండు పత్రికలు కూడా ఈనాటికీ కొనసాగుతున్నాయి.

1940–50 మధ్య పత్రికల్ని చూసుకుంటే, కొత్త రకం పత్రికలు – అంటే కొత్త వర్గానికి చెందిన పత్రికలు మూడు రకాలు ప్రారంభం అయ్యాయని చెప్పుకోవచ్చు. కమ్యూనిస్ట్ పత్రికలూ, పిల్లల పత్రికలూ, సినిమా పత్రికలూ. ఇప్పటికే కమ్యూనిస్ట్ పత్రికల గురించి మాట్లాడుకున్నాం కదా!

ఇప్పుడు 40–50 మధ్యలో ప్రారంభం అయిన పిల్లల పత్రికల గురించి తెలుసుకుందాం.

★★★

అవి బాల, చందమామ.

ముందుగా బాల విశేషాలు తెలుసుకుందాం. చిన్నపిల్లల పత్రికల గతానికి వెళ్తే – 1875 లోనే "జన వినోదిని" మొదటిగా బాలల కోసమని వచ్చింది. అప్పటినుంచి 1940 వరకూ చూసుకుంటే, చిన్నా, చితకా

కలుపుకుంటే సుమారు 20 వరకూ పిల్లల కోసమని ప్రత్యేకమైన పత్రికలు వచ్చాయి. ఇలా ప్రత్యేకమైన పత్రికలే కాకుండా మాములు పత్రికల్లో పిల్లల కోసమని ప్రత్యేకమైన శీర్షికలు కూడా వస్తుండేవి.

వీటన్నిటి మధ్య – సుమారు 15 సంవత్సరాల పాటు నడచిన, మొట్టమొదటిసారిగా సుదీర్ఘకాలం నడచిన పత్రిక ఈ "బాల". అంతకుముందు వచ్చిన పత్రికలు ఏవీ కూడా 4,5 ఏళ్ళు మించి నడవలేదు. ఈ పత్రిక నేపథ్యంలోకి వెళితే – వీటికి సారథ్యం వహించింది, న్యాపతి రాఘవరావు, న్యాపతి కామేశ్వరీ దంపతులు. వీళ్లను మాములుగా వాళ్ళ పేర్ల కంటే, "రేడియో అన్నయ్యా, రేడియో అక్కయ్యా "అనే వాళ్ళు. ఆ రోజుల్లో రేడియో అన్నయ్యా, రేడియో అక్కయ్యా అంటే తెలియని తెలుగువాళ్లు ఉండేవారు కాదు. వాళ్ళు రేడియో మాట్లాడుతుండేవారు కాబట్టి వాళ్ళు మన కుటుంబంలో సభ్యులే అనుకుండేవారు.

వాళ్ళ నేపథ్యం ఏమిటంటే – న్యాపతి రాఘవరావు గారు 1905 వ సంవత్సరంలో ఒరిస్సాలోని బరంపురంలో జన్మించారు. ఆ తరువాత ఆయన విజయనగరం లోనూ, మద్రాస్ లోనూ చదువుకొని మద్రాస్ లో హిందూ పత్రికలో విలేకరిగా ప్రారంభించారు. అక్కడ కొన్ని సంవత్సరాలు పనిచేసాక, అప్పుడే మద్రాస్ లో ఆకాశవాణి ప్రారంభం అయింది. అందులో పిల్లల కార్యక్రమం రూపొందించడానికని న్యాపతి రాఘవరావు గారు కాంట్రాక్ట్ మీద పనిచేయడం ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో న్యాపతి రాఘవరావుగారితో పాటుగా అతని భార్య కూడా పనిచేసేవారు. అప్పటి నుండే వాళ్ళని రేడియో అన్నయ్యా, రేడియో అక్కయ్య అనే వాళ్ళు.

ఆ మద్రాస్ లో వివిధ పాఠశాలల్లోని పిల్లల్ని పోగుచేసి, ఆదివారం పూట రేడియో స్టేషన్ కి తీసుకువచ్చి, అక్కడ చిన్న చిన్న కార్యక్రమాలు ఇవ్వడం ప్రారంభించారు. దానికి ముందుగా "ఆట విడుపు "అని పేరు పెట్టారు. తరవాత అదే కార్యక్రమం "బాలానందం"అయింది. అప్పట్లో ఈ బాలానందం కార్యక్రమాల్ని చిన్న పిల్లలే కాకుండా ఇంట్లో పెద్దవాళ్ళు కూడా వింటూ ఉండేవారు. అలాగే మద్రాస్ లో సినిమా వాళ్లకు ఎవరైనా చిన్న పిల్లలు కావలసి వస్తే, ఈ "బాలానందం" కార్యక్రమం లో పాల్గొన్న పిల్లల్ని తీసుకువెళ్లి, సినిమాల్లో బాలల పాత్రలకి నటింప జేస్తుండేవారు.

ఆ బాలానందం కార్యక్రమం లో పాల్గొన్న వాళ్లలో ముళ్ళపూడి వెంకటరమణ గారు కూడా వున్నారు. ఆయన హైస్కూల్ లో ఉండగానే వెళ్లి, ఆ బాలానందంలో పాల్గొనేవారు. అలా బాలానందం కార్యక్రమం కొనసాగుతుండగానే 1940 లోనే ఈ రేడియో అన్నయ్యా, రేడియో అక్కయ్యా కలసి "ఆంధ్ర బాలానంద సంఘం"అనే సంస్థను స్థాపించారు. తరవాత అది శాఖోప శాఖలుగా విస్తరించింది.. ఇలాగా రేడియో బాలనందం కార్యక్రమం, అలాగే "ఆంధ్ర బాలానంద సంఘం " తరపున చిన్నపిల్లలతో సాంస్కృతిక కార్యక్రమాలూ, వాళ్లల్లో మానసిక వికాసానికి దోహదం చేసే కార్యక్రమాలూ.. ఇలా కొనసాగుతూ ఉండగా 1945 లో వాళ్లకు పిల్లల కోసమని ఒక పత్రిక ఉంటే బాగుంటుంది అని అనిపించింది. అలా ఆ దంపతులు "బాల"అనే పత్రికను ప్రారంభించారు.

ఆ బాల పత్రిక మొట్ట మొదటి సంచిక 1945 ఆగస్టు లో వచ్చింది. బాల పత్రికల్లో వున్న అనేక ప్రత్యేకతల్లో ఒకటేమిటంటే – తరువాత కాలంలో తెలుగు సినిమాల్లో ప్రముఖులుగా గుర్తింపు తెచ్చుకున్న ఇద్దరి సృజాత్మకతకు తొలి వేదిక అయ్యింది బాల పత్రిక. వాళ్లలో ఒకరు ముళ్ళపూడి వెంకటరమణ గారూ, రెండవ వారు బాపు గారూ. బాల పత్రిక వచ్చే సమయానికి మూళ్ళపూడి, బాపు గారలు ఇద్దరూ కూడా హైస్కూలులోనే చదువుకుంటున్నారు. ముళ్ళపూడి వెంకటరమణ గారు వ్రాసిన రెండు అంశాలూ బాల పత్రిక మొట్ట మొదటి సంచికల్లోనే వచ్చాయి.

అందులో ఒకటి "కొనండి... కొనండి... "అని పాట రాసారు. ఆ పాట క్రింద ముళ్ళపూడి వెంకటరమణ, కేసరీ స్కూల్, మదరాసు, వయసు:14 సంవత్సరాలు"అని రాసి వున్నది. బహుశా ముళ్ళపూడి రాసిన తొలి రచన అదే అయి ఉండాలి. ఆ పాట – 1945 ఆగస్టు మొట్ట మొదటి సంచికలో వచ్చింది "అబూ తేరే శివ"అనే పాట వరసలో వ్రాశారట. "చిన్ని బాలులారా..చిన్ని బాలులారా ... కొనగరండు బాల పత్రికను మదరాసు నుండి వచ్చు మన బాల పత్రిక కొనగ రండు.. ఎన్నెన్నో చిట్టి కథలుండున్, మరెన్నో నాటకంబులన్, ఎన్నెన్నో బొమ్మలందు గలవట" ఇలా రాశారు. అప్పుడు ఆయన చదువుతున్నది 9 వ తరగతి మాత్రమే. ఆ పాటతో పాటుగా ఆ మొట్ట మొదటి సంచికలోనే ఒక కథ కూడా రాశారు. ఆ కథ పేరు "అమ్మ మాట వినకపోతే... " ఆ కథలో చక్కటి శైలి. ఎలా రాసారో చూడండి.

"నేనూ, మా అన్నా ఉండేవాళ్ళం. మా ఇంటికల్లా పిల్లలం. మా ఇంటికి ఎవరైనా పిల్లలు వస్తే, మాకు సంతోషంగా ఉండేది. ఎవరూ లేనప్పుడూ, మేం చదవనప్పుడూ మేం ఆడుకుండేవాళ్ళం. ఇలా ఉంటే, మాఇంటికి చుట్టాలు వచ్చారు. వాళ్లతో, వాళ్ళ పిల్లలు ముగ్గురు వచ్చారు. సూర్యం, భాస్కరం, నారాయణం ..."

ఇలాగే చాలా సూటిగా, సరళంగా రాశారు. అందులో వాళ్ళమ్మ "బయటకు వెళ్లి ఆడుకోవద్దురా. "అంటుంది. కానీ, ఆయన బయటకు వెళ్లి ఆడుకుండేసరికి ఒక కప్పను తొక్కి కిందన పడతారు. అలాగే అరటి తొక్కను కూడా తొక్కి కిందన పడతారు. "అలా.. అమ్మమాట వినకుండా బయటకు వెళ్తే ఏమవుతుంది? అని ముళ్ళపూడి చక్కటి కథ రాసారు.

ఆ కథా, ఆ పాటా రాసినందుకు గానూ రేడియో అన్నయ్యా, రేడియో అక్కయ్యా , ముళ్ళపూడి వెంకటరమణ గారికి 5 రూపాయలు పారితోషికం ఇచ్చారు. 5 రూపాయలు తీసుకొని ఇంటికి వెళ్లేసరికి వాళ్ళ అమ్మగారు అనుమానించారట. ఎందుకంటే అప్పుడు 3,4 తరగతులకు ట్యూషన్ చెబితే, రెండు రూపాయలు వచ్చేవి. నెలంతా కష్టపడితే రెండు రూపాయలు తెచ్చే కుర్రాడు, హఠాత్తుగా 5 రూపాయలు ఎలా తెచ్చాడు?అని వాళ్ళ అమ్మగారికి అనుమానం వచ్చి, ఆవిడ బాల పత్రిక ఆఫీసుకు వెళ్లి "నిజమేనాండీ. మీరు 5 రూపాయలు ఇచ్చారా? లేకపోతే , మా అబ్బాయి ఎక్కడైనా దొంగతనం చేసుకొచ్చాడా?"

అప్పుడు వాళ్ళు "మీ అబ్బాయి ట్యూషన్ కు ఎన్ని డబ్బులైనా రానీ, మేము మాత్రం 5 రూపాయలు పారితోషికం మేమే ఇచ్చాం. మీ అబ్బాయి మంచి కథ రాసాడు. భవిష్యత్తులో మంచి రచయత అవుతాడు"అని వాళ్ళు నిర్ధారణ చేశారు. ఆ ధైర్యంతో ముళ్ళపూడి వెంకటరమణ గారు ఆ తరవాత 10 రోజులకే 7,8 కథలు రాసి తీసుకువెళ్ళారట. అప్పుడు న్యాపతి రాఘవరావుగారు చెప్పారు "బాబూ! ఏదో నీ కథ ఒకటి వేశాం. అలాని ఇన్ని కథలు తీసుకువచ్చేస్తే, అన్ని నీ కథలే వేసేస్తే మరి, మిగతావాళ్ళకి అవకాశం ఇవ్వాలి కదా! ఒక పని చెయ్యి. నేను నీకు ఒక కథాంశం చెబుతాను. దాన్ని సీరియల్ గా రాసుకుంటూ రా, నెలకి ఒక భాగం చొప్పున వేస్తాను"అన్నారు.

అలాగే ఇచ్చారు. ముళ్ళపూడి దాన్ని బాలల సీరియల్ లాగా రాశారు. ఇదంతా కూడా బాల పత్రికలో వచ్చింది. మళ్ళా, ఈ బాల పత్రిక మొట్టమొదట సంచిక విషయానికి వస్తే, ఇది పిల్లల పత్రికే అయినప్పటికీ ఇందులో సాహిత్యంలో ఉద్దండులైన వారందరూ కూడా రాశారు. ఉదాహరణకు.. కవికొండల వెంకటరావు గారూ, ఆయన చిన్న పిల్లల కోసమని ఎంత తేలిగ్గా రాసారంటే, "ఇంటి శుభ్రత" ఇంటిని ఎలా శుభ్రంగా ఉంచుకోవాలి.

"గదిని తుడుచు నంత, గదియునెల్ల నున్నగా శుభ్రముగా నొసగు చూడుడిపుడు. దుమ్ము పోవునటు తుడువుడీ నేలను. ఇసుక రేణువు నింత ఏమియును లేదు. ఎప్పుడు ఇంత చెడ్డ ఇల్లు ఇంత చక్కగా చేసి మెరుగ మింత. ఎత్త చెత్త గలదో? చాప ఇంత ఎత్త, సఖియా చూచిటవతే భయము వేయు చుండె పట్టి దులప. "ఇల్లు మురికిగా ఉంటే ఎంత భయంకరముగా ఉంటుందో?దాన్ని ఎలా శుభ్రం చేసుకోవాలి. అనే విషయాన్ని కవికొండల వెంకటరావు గారి లాంటి పెద్ద కవి, చిన్నపిల్లలకు అర్ధమయ్యే రీతిలో చక్కటి గేయ రూపంలో మొదటి సంచికలోనే రాసారు.

అలాగే మాస్టర్ సాలూరి రాజేశ్వరావు అని ఆయన స్వరపరచిన ఒక పాట.. "బాలుడే... గోప బాలుడే... "మాస్టర్ రాజేశ్వరావు, జెమినీ ఆర్కెస్ట్రా , అని మొట్ట మొదటి సంచికలో వేశారు. పిల్లలకు అన్ని రకాలైన అంశాలను అందించాలనే ఉద్దేశ్యంతో సినిమా విశేషాలు కూడా చెప్పాలి. కానీ, చిన్న పిల్లలు "ద్రౌపది" అనే పేరు శీర్షిక తోటి "పేకేటి శివరాం గారు"ఒక సినిమా రివ్యూ రాశారు. కొంత భాగం మాత్రం ఇక్కడ ఇస్తున్నాను.

"ద్రౌపది"

అబ్బాయి ఫిల్మ్ రివ్యూ: –పేకేటి శివరావు.

"నాన్నారూ?"

"ఏం బాబూ?"

"ఈ బొమ్మేమిటి?"

"బెంగాల్ లో అన్నం లేక మాడిపోయే ఒక దిక్కులేని ఆడది"

"అలా కనిపిస్తున్నదేమిటి?"

"అంతే నాన్నా, తినడానికి ఏమీ లేకపోతే, అలా చచ్చిపోతారు."

తరవాత...

"ఈ బొమ్మేమిటి నాన్నా?"

"మరచిపోయావూ?నిన్న మనం సినిమాలో చూసాము. ద్రౌపది. "

"అవును నాన్నరూ ఇందాక బెంగాల్ లో చచ్చిపోయే దానిలాగే ఉందేమిటి?

" ఛ .... తప్పు నాన్నా అలా అనకూడదు. అది అన్నం లేక చచ్చిపోయే ఆడది. ఇది వేలకొద్ది సంపాదించే సినిమా తార. "

"నాన్నారూ... సినిమా తారలు అంటే ఏమిటి?"

"సినిమాలో నటించేవారన్న మాట"

"నటించడం అంటే ఏమిటి?నాన్నారు "

"నటించడం అంటే అసలు ద్రౌపది వలె, ఈ ద్రౌపది కూడా ఆడడం."

"నాన్నారూ అసలు ద్రౌపదికి అయిదుగురు భర్తలని చెప్పారు కదా!"

"అవును నాన్నా"

"మరి ఈ ద్రౌపదికి కూడా అయిదుగురా?"

"నిజంగా కాదు బాబు. కథలో అలా నటిస్తుంది"వ్ఇట్లా.. ఇంత సరళంగా, చిన్న పిల్లల భాషలో, వాళ్ళు ఎదురుగుండా కూర్చొని మాట్లాడుతున్నట్లు సినిమా రివ్యూ కూడా రాసారు మొట్ట మొదటి సంచికలో.

బాల పత్రిక రెండో సంచిక అంటే సెప్టెంబర్ లో ఆ పత్రిక మొట్ట మొదటి సంచికమీద వచ్చిన స్పందనలు ప్రచురించారు. దాంట్లో సండే టైమ్స్ అనే ఇంగ్లీష్ పత్రిక బాల పత్రిక మొదటి సంచిక ఎలా వున్నది అనే విషయాన్ని రాస్తూ.. "ది ఫస్ట్ &మోస్ట్ బ్రిలియంట్లీ ఎడిటర్ చిల్డ్రన్స్ పేపర్ ఇన్ తెలుగు ఈజ్ బాల. ఎంటైర్లీ డివోటెడ్ టు ది డెలికేషన్ ఆఫ్ చిల్డ్రన్ ఫర్ ఎ బర్త్ డే స్క్రిప్ట్ సూట్ ఎడ్ మైర్బలి " అని రాసారు.

అప్పట్లో వున్న చాలా మంది ప్రముఖులు రేడియో అన్నయ్యకు శుభాకాంక్షలు తెలియజేసారు. "తెన్నేటి విశ్వనాథం గారూ, విస్సా అప్పారావు గారూ, అలాగే సినీ నటుడు నాగయ్య గారూ... వీళ్ళందరూ కూడా అభినందనలు తెలియజేసారు.

మూడవ సంచికలోని ఒక ఆసక్తికరమైనటు వంటి అంశం వుంది. అదేమిటంటే... దేవులపల్లి కృష్ణ శాస్త్రి గారి అబ్బాయి బుజ్జాయి. అప్పటికి ఆయనింకా హైస్కూల్ లోనే వున్నారు. బాల పత్రిక కోసమని "బాల చంద్రుడు"అని ఒక జెండా రూపొందించి, దాన్ని ఒక బొమ్మ వేసి పంపించారు. దాంట్లో ఆ బుజ్జాయిగారి పరిచయం కూడా వుంది.

తెలుగు వెలుగు అనే పేరు తోటి. ఆయన ఫోటో వేసి, “ఈ పేరు చాలా ముద్దుగా వుంది కదా! ఇది ఈ అబ్బాయి అసలు పేరు కాదు. అసలు పేరు దేవులపల్లి సుబ్బరాయ శాస్త్రి. పెద తండ్రిగారి పేరు పెట్టుకున్నారు. ఈ అబ్బాయి నాన్న ఎవరో తెలుసా? అతను కూడా గొప్ప కవే. మహా కవి దేవులపల్లి కృష్ణ శాస్త్రి. ఆ కుర్రవాడికి 12 ఏళ్ళు. చిన్న కుర్రవాడైనా బొమ్మలు చక్కగా వేస్తూ ఉంటాడు.” అని బుజ్జాయిగారి యొక్క పరిచయం రాసారు.

ఇంకా బాల పత్రికలో మరొక విశేషం చెప్పుకోవాలంటే, 1946 జూలైలో ఒక గేయం వచ్చింది. దానికి ఒక బొమ్మ వుంది. ఆ గేయం రాసినవారు దూర్వాసుల విశ్వేశ్వరావు. విశాఖపట్నం. “అడవిలో పుట్టింది. అడవిలో పెరిగింది. మా ఇంటికొచ్చింది. మా అమ్మ మెచ్చింది. తాడేసి కట్టింది. కడవలో దూరింది. తైతక్క లాడింది. గుర్రుమన్నాది. పెరుగులో మూలిగింది. వెన్నంత తెచ్చింది. నాకింత పెట్టింది. తానేమీ తినక.”

ఇది “కవ్వపు పాట “దీనికి ఒక చిన్న పాప కవ్వం చిలుకుతున్నట్లుగా బొమ్మ వుంది. ఆ బొమ్మ వేసినతని పేరు కిందన వేశారు. “సత్తిరాజు లక్ష్మీ నారాయణ, 5వ ఫారం, మద్రాసు “. ఆయనే బాపు గారు. అంటే బాపు గారు వేసిన మొట్టమొదటి బొమ్మ 1946 జూలై బాలలో వచ్చింది. ఆ విధంగా ముళ్ళపూడి రాసిన రచన మొట్టమొదటి సంచికలోనూ, బాపు గారు వేసినటు వంటి బొమ్మ మరో సంవత్సరానికి జూలై లోనూ వచ్చి... అలా బాల పత్రిక మొట్ట మొదటి వేదిక అయ్యింది.

ఈ బాల పత్రికలనింటినీ కూడా ఎంతో శ్రమకోర్చి, సేకరించి హైదరాబాద్ లో వుండే వై.వి.ఎస్.ఆర్.ఎస్.సాయి గారు 4 పెద్ద పెద్ద వాల్యూమ్స్ లాగ ప్రచురించారు. ఆ పత్రికల్లోని అంశాలనన్నిటినీ మళ్ళా కంపోజ్ చేయడమే కాకుండా, ఆ పేజీలను యధాతథంగా అదే సైజులో ఉంచి, ఆ బాల పత్రికలన్నీ కూడా మన ముందుకు తీసుకువచ్చారు రచన సాయి గారు.

దానికి ముళ్ళపూడి వెంకటరమణ గారు ముందు మాట రాస్తూ, తాను బాలలో రాసిన కొన్ని అనుభవాలు చెప్పారు.

“కేవలం పిల్లల కోసం పుట్టిన , పెట్టిన పత్రిక బాల. 4 ఫారం లో వున్నప్పుడే బాపు బొమ్మలూ, కథలూ, నాలాంటి వాళ్ళ పాటలూ, పద్యాలూ అందులో అచ్చు వేశారు. అప్పట్లో పెద్ద వాళ్ళ కోసం ‘ఆల్ ఇండియా రేడియో వార్తలు ఉన్నట్లు బాలలకోసం “బాలిండియా రేడియో వార్తలూ, పిల్లలకు పనికి వచ్చే, సరదాగా ఉండేవి వచ్చేవి. ఆ రోజుల్లోనే పిల్లలకు అర్ధ రూపాయి, ముప్పావలా, రూపాయి, రూపాయిన్నర, రెండు రూపాయలూ, ఇలా వాళ్ళ వాళ్ళ కృషిని బట్టి డబ్బులు ఇచ్చే వాళ్ళు. బాపు లాంటి వాళ్ళని “హిగ్గిన్ బాదమ్స్ “ కి తీసుకువెళ్లి, డ్రాయింగ్ పేపరు, ఇంకూ, పెన్నులూ కొని పెట్టేవాళ్ళు. నాకు మంచి కథల పుస్తకాలు కొని పెట్టేవారు.” అని.

అలాగే 14 సంవత్సరాలు నడచినటువంటి బాల పత్రిక గురించి మరికొన్ని విశేషాలేమిటంటే – ఏదైనా సరే పిల్లల పరంగానే ప్రచురించేవారు. భానుమతి రామకృష్ణ గారి కథ ప్రచురించినపుడు, రచయిత్రి పేరు రాస్తూ క్రింద.. “మాస్టర్ భరణి అమ్మ పి . భానుమతి”అని రాశారు. అంటే దాని రిఫరెన్స్ కూడా భానుమతి గారి అబ్బాయి పేరు తో ఇచ్చారన్నమాట. “ఏక వాక్య కథలు” అనేది కూడా బాల లోనే మొట్ట మొదటి సారిగా ప్రారంభం అయింది. అలాగే ఇప్పుడు “తెలుగింలిష్ “అంటారు చూడండి. తెలుగునే ఇంగ్లీష్ లో రాస్తాము. meeru అంటే “మీరు”అట్లా రాయడం అనేది 1952 జూన్ బాల సంపాదకీయం లోనే ప్రారంభించారు రేడియో అన్నయ్య గారు.

“ఆంగ్లం అక్షరాలలో తెలుగు”అని ఆ తరువాత దానికి సమాధానంగా ఒకావిడ తెలుగుని ఇంగ్లీష్ అక్షరాలలో రాసారు. అంటే, ఇలాంటి విన్నూతనమైనటువంటి ప్రయోగాలు అప్పుడే చేశారు. అలాగే “తెలుగు వెలుగులు”అనే శీర్షికలో కంద కల్పకం, టంగుటూరి సూర్యకుమారి గారు ఇలాంటి వాళ్ళని పరిచయం చేశారు. పిల్లల మనో వికాసం కోసమని వ్యాసాలూ, మెదడుకు మేత అనే పేరుతో అనేక రకాల శీర్షికలూ ఇలాంటి వన్నీ ఉండేవి. ఆ శీర్షికల్లో కూడా “రామూ–సోమూ “ సరళ–విరళ” “కుటుకు–చిటుకు” ఇలాంటివి చాలా ప్రసిద్ధి పొందినవి. 1945 లో ప్రారంభించారు కదా ఈ పత్రికను అది 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో రేడియో అన్నయ్యా, రేడియో అక్కయ్యా ఇలా రాశారు. ఆగస్టు 1955 బాల పత్రికలో

అర్పణ

“మా జీవితమంతా బాలల ఉద్యమానికి సమర్పించాం. శక్తి కొలది సేవ చేస్తున్నాం. “బాల” ను 10 సంవత్సరాలు పెంచాం. బాల మంచి పేరు తెచ్చుకున్నందుకు సంతోషిస్తున్నాము. గర్విస్తున్నాం. ఇక ముందు కూడా ఈ “బాల” కూ, బాలల ఉద్యమానికీ మా జీవితాల్ని అర్పిస్తాం. మాకు తగిన బలం, ప్రోత్సహం ఆంధ్ర లోకం ఇస్తుందని ఆశిస్తాం. “... న్యాయపతి రాఘవరావు(బాల అన్నయ్య) న్యాయపతి కామేశ్వరి (బాల అక్కయ్య),

చాలా సంవత్సరాలు నడుపుదామని అనుకున్నారు. కాకపోతే, ముందు మనం చెప్పుకున్నట్లుగానే, ఈ పత్రికలేవీ వ్యాపార దృక్పథంతో నడిచిన పత్రికలు కాదు. కేవలం, పిల్లలకు ఆనందం కోసం, ఆహ్లాదం కోసం, విజ్ఞానం కోసం అని నడిపినటువంటి పత్రిక బాల. ఏ పత్రిక అయినా గానీ, ప్రకటనలు ఎక్కువగా ఉండాలి. వెనుక పెట్టుబడి పెట్టె వాళ్ళు ఉంటే, ఆ పత్రిక నడిచే విధానం వేరు. ఇలా.. వ్యక్తిగతంగా నడిపే పత్రికలు ఎక్కువ సంవత్సరాలు నడవలేవు – అనడానికి ఒక ఉదాహరణ ఈ బాల పత్రిక. 1959 సెప్టెంబరు కే చిట్ట చివరి సంచిక అయింది ఈ బాల పత్రిక. ఇప్పుడు ఈ బాల పత్రిక చదవాలని అనుకుంటే archive.org లోకి వెళితే కొన్ని సంచికలు వున్నాయి. ఎక్కువ సంచికలు కావాలంటే, హైదరాబాదు లోని రచన సాయి గారి దగ్గర 4 పెద్ద వాల్యూమ్స్ దొరికే అవకాశం వుంది. ఇవీ బాల పత్రిక విశేషాలు.

తెలుగులో పిల్లల సాహిత్యం లోనే కాదు, మొత్తం తెలుగు సాహిత్యంలో అన్ని తెలుగు పత్రికల్లో కూడా “చందమామ ముందు, చందమామ తర్వాత” అనేటంతగా ఒక పత్యేకతను సృష్టించుకున్న, నిలబెట్టుకున్న పిల్లల పత్రిక “చందమామ”. పేరుకి పిల్లల పత్రికే గానీ, నిజానికి అన్ని వయసుల వారినీ ఆకర్షించిన, అలరించిన పత్రిక చందమామ. ఆ రోజుల్లోనే కాదు, ఇప్పటికి కూడా రామాయణ, భారత, భగవతాల్లాగా తమ ఇళ్ళళ్ళో అతి భద్రంగా చందమామను దాచుకున్న వాళ్ళు ఎంతో మంది వున్నారు. అక్షరాలు కూడా బలుక్కొని చదవడం మొదలుపెట్టిన వారి దగ్గర నుంచి, విశ్వనాథ సత్యన్నారాయణ లాంటి మహా కవి దాకా చందమామ పాఠకులు వున్నారు అనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

తెలుగులో ప్రారంభం అయినప్పటికీ, తెలుగు ప్రధాన ఎడిషన్ అయినప్పటికీ, మొట్ట మొదట్లోనే రెండు భాషల్లో మొదలయి, కొద్ది సంవత్సరాల్లోనే 6 భాషలకు విస్తరించి, ఆ తరువాత కొద్ది దశాబ్దాలలోనే 17 భాషల్లోకి అనూహ్యంగా ఎదిగిన ఖ్యాతి చందమామది. “అప్పటి ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ దగ్గర నుంచి,ఇందిరా గాంధీ, మొరార్జీ దేశాయ్ లాంటి ప్రముఖులు కూడా చందమామ పత్రిక అభిమానుల్లో కొంత మంది” అని తెలుసుకోవడం చందమామ సంపాదించుకున్న ప్రత్యేకతకు ఒక ఉదాహరణ.

స్థాపకుడూ, నిర్వాహకుడూ బి. నాగిరెడ్డి గారిని, భారతదేశంలోని ఇతర ప్రాంతాల వాళ్ళు “చందమామ నాగిరెడ్డి “గా గుర్తించేవారు అంటే, చందమామకు భారతదేశం మొత్తం మీద ఎంత విస్తరించిన పేరు వుందో, ఎంత గుర్తింపు వుందో, ఊహించుకోవచ్చు. ప్రకృతిలో ఏదీ శాశ్వతం కాదు అన్న విషయం నిజమేగానీ, ఒకప్పుడు ఎవరెస్టు శిఖరమంత ఎత్తులో నిలచిన చందమామ ప్రస్తుతం పూర్తిగా కనుమరుగైపోవడం అత్యంత విచారకరం, ఇక వివరాల్లోకి వెళదాం.

1947 జూలై లో చందమామ మొట్టమొదటి సంచిక విడుదలయ్యింది. మధ్యలో ఒకటి, రెండు సార్లు విరామం తీసుకొని, చివర్లో యాజమాన్యం చేతులు మారి, సుమారుగా 2013 వరకు కొనసాగినట్లు నా దగ్గర వున్న సమాచారం. చందమామ పత్రిక ప్రారంభానికి ముందు కొంత నేపథ్యం వుంది. అది చెప్పబోయే ముందు పాఠకులకు ఒక విషయం గుర్తు చేస్తాను. చందమామ పత్రికకకు మూల స్థంభలు అనదగిన వ్యక్తులు నాగిరెడ్డి గారూ, చక్రపాణి గారూ, కొడవటి గంటి కుటుంబరావు గారూ, దాసరి సుబ్రహ్మణ్యం గారూ. వీళ్ళలో చక్రపాణీ, నాగిరెడ్డి గార్ల గురించి సమగ్రమైన కార్యక్రమాలు (టాక్ షో) గతంలోనే వున్నాయి.

అలాగే చందమామ పత్రికలో 54 సంవత్సరాల పాటు పనిచేసి, అందులో వ్రాసిన అనేక సూపర్ హిట్ సీరియల్స్ తోక చుక్క, కంచుకోట, రాకాసి లోయ, భల్లూక మాంత్రికుడు, ఇలాంటి మహాద్భుత సృష్టికర్త దాసరి సుబ్రహ్మణ్యం గారి గురించి కూడా 8 ఏళ్ళ క్రితమే ప్రత్యేక కార్యక్రమం (టాక్ షో)ప్రసారం చేశాను.

చక్రపాణిగా అందరికీ తెలిసిన ఆలూరి వెంకట సుబ్బారావుగారు చిన్న వయసులోనే క్షయ వ్యాధికి గురయ్యారు. 1935 లో ఆయనకు 27 సంవత్సరాల వయసు వున్నప్పుడు ఒక ఊపిరితిత్తిని కూడా తొలగించారు. ఆ చికిత్స కోసమని చక్రపాణి గారు మదనపల్లిలో టి.బి. శానిటోరియంలో ఉండాల్సి వచ్చింది. అప్పుడు ఆయన పక్కన ఉన్న బెంగాలీ వ్యక్తి తో పరిచయం అయింది. ఆ పరిచయంతో చక్రపాణి గారు బెంగాలీ నేర్చుకొని, అందులో ప్రావీణ్యం సంపాదించడానికి దారి తీసింది. అలా బెంగాలీ సాహిత్యం కూడా పరిచయం అయింది. బెంగాలీలోని ప్రముఖ రచయితలను తెలుగులోకి అనువాదం చేయడం ప్రారంభించారు. ఆ క్రమంలో బెంగాలీ లోని పిల్లల పత్రికలు చక్రపాణి గారిని ఆకర్షించాయి.

అలాంటి పత్రికను తెలుగులోకి కూడా తీసుకురావాలని చక్రపాణి గారికి చాలా కాలం కోరికగా ఉండేది. ఆయన యువ, విహారి ఇలాంటి  పత్రికలూ, అలాగే ఇతర పుస్తక ప్రచురణాలూ చేస్తూ వచ్చారు గానీ, పిల్లల పత్రిక అనేది 10 ఏళ్ళ పాటు ఒక కలగానే ఉండిపోయింది. 1944 ప్రాంతాల్లో ఆయన స్వర్గ సీమ అనే సినిమా రచన కోసమని ఆయన మద్రాస్ వచ్చారు. బి. నాగిరెడ్డి గారితో పరిచయం జరిగింది. అప్పటికే బి. నాగిరెడ్డి గారు విజయవంతంగా ప్రెస్ నిర్వహిస్తున్నారు. ఆయనతో పరిచయం అయిన చక్రపాణి గారు, ఆయన ప్రెస్ లో పుస్తకాల్ని ముద్రించుకుంటుండేవారు. “ యువ పబ్లికేషన్స్”అనే పేరు తోటి. అప్పుడు వాళ్ళిద్దరి సంభాషణల మధ్య వచ్చిన అంశం – పిల్లల పత్రిక పెట్టాలని.

అలా మొదలయ్యింది చక్రపాణి గారి మానస పుత్రిక “చందమామ”పిల్లల మాస పత్రిక.

నాగిరెడ్డి గారి వ్యాపార దృక్పధం, చక్రపాణి గారి సృజత్మకత కలసి చందమామ పత్రికకు పటిష్టమైన పునాదులు వేశాయని చెప్పుకోవచ్చు. చందమామ పత్రిక సైజు నుంచి, ప్రతి పేజీ, ప్రతి అంశం కూడా మొట్ట మొదటి నుంచే విభిన్నంగా, విన్నూతనంగా ఉండేలాగా చక్రపాణి గారు తన సృజనాత్మకతకు పదును పెట్టారు. అప్పటి వరకూ పత్రికలు అంటే, వివిధ సైజుల్లో ఉండేవి. బాల పత్రిక కూడా విభిన్నం గా ఉండేది. అట్లా కాకుండా వాటన్నిటికీ కూడా విభిన్నంగా ఉండేలా ఎక్సర్సైజు పుస్తకం సైజులో చందమామను రూపొందించారు అది  పిల్లల పత్రిక కాబట్టి. దానికి కారణం కూడా వుంది. పిల్లలు ఆ పుస్తకం చూడగానే మన ఎక్సరసైజు పుస్తకం లాగ వుంది కాబట్టి, ఇది మన పత్రికే అనుకోవాలి. అని పిల్లల పుస్తకాల్లో ఒక పుస్తకం లాగా కలసి పోయేలా ఉండాలని ఆ సైజుని నిర్ణయించారు చక్రపాణి గారు.

చందమామ మాస పత్రిక మొట్టమొదటి సంచికలో ఏముందో సంక్షిప్తంగా చూద్దాం. ముందుమాట. సంపాదకీయం అని మనం అనుకోవచ్చు. దాంట్లో ఎవరో ఒక సంపాదకుడు రాసినట్లో కాకుండా, చందమామే రాసినట్లుగా రాసారు. “చందమామ, సంచలన:చక్రపాణి, 1 జూలై 1947 సంచిక:1,

తెలుగు పిల్లల్లారా!

మీకు వూహ వచ్చినప్పటి నుంచి నన్ను మీ చిట్టి చిట్టి చేతులతో "చందమామ రావే! జాబిల్లి రావే!" అని పిలుస్తుండేవాళ్ళు. మీరే కాదు, మీలాగా మీ అమ్మా, మీ నాన్నా, మీ తాతా, మీ అవ్వా, మీ ముత్తాతా, మీ ముట్టవ్వా, ఆయన తండ్రి, ఆయన తాతా ఇలా.. అందరూ"మామా"అని పిలిచేవాళ్ళు. నేను నవ్వేవాడ్ని. నా నవ్వు చూస్తే మీకు ఎక్కడలేని సంతోషం. నన్ను తెచ్చిపెట్టమని అమ్మతో పోరు పెట్టేవాళ్ళు. చూశారూ! మీరే కాదు శ్రీరాముడు కూడా వెనక ఇలాగే పోరు పెట్టాడు. అప్పుడు వాళ్ళ అమ్మ కౌసల్య ఏం చేసిందనుకున్నారు? అద్దం తెచ్చి ఇచ్చింది. పాపం అద్దంలో నా బొమ్మ చూసి, నేను వచ్చానని ఏడుపుమానాడు శ్రీరాముడు. చూశారా ఎంత అమాయకుడో. అయితే, నేను మీ ముత్తాతల, తాతల తండ్రుల కాలంలో రాలేకపోయాను. కానీ, ఇప్పుడు వస్తున్నాను. మీ చెల్లెళ్ళకూ, మీ అక్కలకూ, అన్నలకూ తమ్ముళ్ళకూ కనిపిస్తాను.కింద భూలోకంలో, పైన ఆకాశంలో నేను చూసిన వింతలూ, విడ్డూరాలూ ... చెబుతాను."

ఇలా చందమామే చెబుతున్నట్లుగా రాశారు.

మొట్టమొదటి అంశమే చాలా ఆశ్చర్యకరంగా ఉంటుంది. ఎవరు రాసారో తెలిస్తే ఇంక ఆశ్చర్యం కలిగిస్తుంది. అది రాసింది చలం గారూ, దీక్షితులుగారూ ఆ పాట ఏమిటంటే..

"ఆహ్వానము"

చందమామ రావే, జాబిల్లి రావే, రైలెక్కి రావే, రష్యా కథలు తేవే, ఇంజనెక్కి రావే, ఇంగ్లీషు కథలు తేవే, బస్సెక్కి రావే, బంగ్లా కథలు తేవే, కారెక్కి రావే, క్రామేడ్ కథలు తేవే, హారన్ ఊదూ్త రావే, ఆకలి కథలు తేవే, కొండెక్కి రావే, కోటి వేలు తేవే, ఒలిచిన చాక్ లెట్లు ఒళ్ళో పెట్టుకొని, కరిగిన ఐస్ క్రీము చేత్తో పట్టుకొని, అలా... అలా.. వచ్చి, మా తెలుగు పిల్లల తీపి నోట్లో పోసి, పోవే"

ఇదీ – అప్పటికే తన రచనలతో ఒక కుదుపు కుదిపేసిన చలం గారూ, ఆయన మిత్రుడు చింత దీక్షితులు గారితో కలసి వ్రాసిన అత్యంత సరళమైన గేయం.

ఇంకా చందమామ మొదటి సంచికలో కథలూ, శీర్షికలూ వాటి విశేషాలలోకి వెళ్తే – కథల్లో చాల వాటికి రచయితల పేర్లు వుండవు. బహుశా అన్నీ చక్రపాణి గారే రాసి వుండాలి. 45 వ పేజీలో ఆడపిల్లల పాటలు పేరుతో ఒక గేయం వుంది. ఇది రాసింది దేవులపల్లి కృష్ణ శాస్త్రి గారి సోదరి, వింజమూరి వెంకట రత్నమ్మ గారు. వింజమూరి అనసూయాదేవి గారికి తల్లి గారు. ఆవిడ ఇలా రాశారు.

"పెద్ద చెరువు గట్టునా భేరీ ఆగింది, పెళ్లి వారొచ్చారు పెద వీధిలోకి!పసుపు కుంకాలన్నీ పళ్ళల బట్టి, రండి పేరంటాళ్ళు ... "ఇలా సాగుతుంది.

అలాగే మొట్టమొదటి సంచిక లోనే వ్యాస రచనా పోటీలు నిర్వహించారు. క్విజులూ, పజిల్సూ ఇలాంటివి కూడా పెట్టారు.

మొత్తం మీద పిల్లలకి వినోదం, ఆహ్లాదం, విజ్ఞానం, మనో వికాసం, ఇవన్నీ అందించే మిశ్రమంగా మొదటి సంచిక సమకూర్చారు సంచాలకుడూ, సంపాదకుడూ ఐన చక్రపాణి గారు. మొదటి సంచిక చందమామ 64 పేజీలతో, వెల 6 అణాలు. ముద్రించిన కాపీలు ఆరువేలు. మొట్టమొదటగా ఈ చందమామ విడుదల అయినప్పుడు – ప్రముఖ నగరాల్లోని పోస్ట్ ఆఫీసుల్లోని, పోస్ట్ మాస్టర్లు అందరికీ కాపీలు పంపించి, "దీన్ని మీ దగ్గరకు వచ్చిన వాళ్లకు చూపించి, ప్రచారం చెయ్యండి" అని చెప్పారు. అలాగే, ఆయా గ్రామాల్లో ఉత్సాహవంతులైన యువకులు ఎవరున్నారో తెలుసుకొని, వాళ్ళకి ఏజెన్సీ ఇచ్చేలాగా ఏర్పాటు చేసుకున్నారు.

నాగిరెడ్డి గారూ, చక్రపాణి గారూ ఈ చందమామ సంచికను విడుదల చేసినప్పుడు మద్రాస్ మెరీనా బీచ్ కు వెళ్లి, అక్కడకు వచ్చిన వాళ్లకు చందమామ సంచికను చూపించి, ప్రచారం చేశారట. ఆ విధంగా ఒక పబ్లిషరూ, ఎడిటరూ సంచికను తీసుకెళ్లి, తమంతా తాముగా ప్రచారం చేయడం అనేది బహుశా ఈ చందమామ తోనే మొదలయ్యి ఉండాలి. 1947 ఆగస్టు సంచిక లో అంటే రెండో సంచికలో (అప్పటికి స్వాతంత్రం రావడం దగ్గర్లో వుంది) ఆ సంచికలో ఏం రాసారంటే,

"మీరు నన్ను చూసి సంతోషాన్ని వెలిబుచ్చుతూ రాసిన జాబులన్నీ చేరినవి. మీకు ఇవే నా దీవెనలు. ఇక ముందు కూడా అందచందాలతో, గమ్మత్తు గమ్మత్తు కబుర్లు చెబుతాను సరేనా?"

అంటూ ఇంకా ఏమి వ్రాశారంటే, "చూడండి. చందమామ ఏ ఒక్క జాతికీ, ఏ ఒక్క వ్యక్తికీ మామ కాదు. హిందూ దేశంలో అన్ని జాతులకూ, అందరికీ మామే. అందుచేత నేను అరవం, కన్నడం, మలయాళం, హిందీ మొదలైన అన్ని భాషలలోకి వచ్చి, అందరికీ కనిపించాలని అను కుంటున్నాను.మీరేమంటారు" అంటే, మొట్ట మొదటి సంచిక విడుదల చెయ్యగానే, చాలా భాషల్లో వెలువరించాలి అనే ఆశయాన్ని పెట్టుకున్నారు. దాన్ని తరవాత సాకారం చేసుకున్నారు కూడానూ.

మొదలైన అతి త్వరలోనే చందమామ తెలుగు వారి సంస్కృతిలో ఒక భాగం అన్నంతగా పేరు తెచ్చుకుంది. చందమామ పత్రిక ఎలా తయారవుతుంది?వెనకాల ఎవరెవరు వున్నారు? ఇలాంటివన్నీ అందరికీ తెలియజేయాలి అనే ఉద్దేశ్యంతో 1954 నవంబర్ దీపావళి ప్రత్యేక సంచికలో ఒక ప్రత్యేకమైన వ్యాసం ప్రచురించారు. దాంట్లో చందమామ ప్రారంభమైన నేపథ్యం గురించి వివరించాక, చందమామ ఆఫీసుల్లోని ఫొటోలూ, బిల్డింగులూ,

అందులో ఎవరెవరు ఎక్కడెక్కడ కూర్చుంటారు? ఇలాంటివన్నీ కూడా చాలా వివరంగా చూపించారు. ఆ రోజుల్లో టి.వి లు లేవు కదా! మరి ప్రచారం చేయాలంటే, చందమామ అందరిలోకి అంతలా వెళ్ళిపోయింది. అసలు ఎలా తయారవుతుంది?ఎవరెవరు వుంటారు?ఎక్కడెక్కడ వుంటారు?ఇలాంటివన్నీ తెలియడానికి చిత్రాలన్ని కూడా చాలా ప్రముఖంగా ప్రచురించారు. అవి మీరు చూడాలంటే ఈ కార్యక్రమం యూ-ట్యూబ్ లో చూడవచ్చు.

"అయితే దాన్ని ఎలా తయారు చేస్తారో మీకు తెలియక పోవచ్చు. అందువల్ల లోపలి రండి. మీకు అవన్నీ చూపిస్తాను. " అని మొట్ట మొదటగా ఒక ఫోటో వేశారు. లోపలి అడుగు పెట్టగానే మూడు వైపులా చక్కని కట్టడాలు, అందులో ఒక వైపున పెద్ద హర్మ్యాలూ కనిపిస్తాయి. అదంతా కూడా "చందమామ కాంప్లెక్స్"అనే వారు ఆ రోజుల్లో. తరవాత పేజీలో ఒక 5 ఫోటోలు వేశారు. ఆ తరవాత పేజీలో మరొక 2 ఫోటోలు వేశారు. ఈ ఫోటోలు ఏమిటంటే? చందమామ యొక్క వర్ణ చిత్రాలను ఎక్కడ తయారు చేస్తారు?అలాగే నాగిరెడ్డి, చక్రపాణిలు ఎక్కడ కూర్చుంటారు? ఎడిటోరియల్ స్టాఫ్ ఎక్కడ కూర్చుంటారు?చందమామలో వుండే ఆర్టిస్టులు ఎక్కడ కూర్చుంటారు?అలాగే ప్రోసెసింగ్ ఎక్కడ జరుగుతుంది?ఇలాంటివన్ని కూడా తరవాత బొమ్మల్లో చూపించారు.

ఆ తరవాత ఫోటోల్లో ప్రింటింగ్ మిషన్లు ఎలా ఉంటాయి? ప్లేట్ మేకింగ్ ఎలా వుంటుంది? బైండింగ్ ఎలా చేస్తారు?ఇలాంటి బొమ్మలన్నీ కూడా వున్నాయి. చిట్టా చివరి బొమ్మల్లో ఆర్థిక మంత్రి దేశ్ ముఖ్ గారూ, ఆయన సతీమణి దుర్గా భాయ్ దేశ్ ముఖ్ గారు కూడా ఈ చందమామ ప్రెస్ కి వచ్చి అది ఎలా పబ్లిష్ అవుతుంది అని చూశారు. అంతే కాకుండా విదేశీయులు కూడా వచ్చి చందమామ ప్రెస్ లో ఈ పత్రికను అనేక భాషల్లో ఎలా ప్రింట్ చేస్తారు? అని తెలుగు భాషలో ప్రారంభించి, ఇతర భాషల్లోకి ఎలా అనువాదం చేస్తారు. ఎంతమంది పనిచేస్తూ వుంటారు? ఇలాంటివన్ని కూడా అందరూ ఆసక్తికరంగా వచ్చి చేస్తుండేవారు.

ఇంక చందమామలో అక్షరాల పని చక్రపాణి గారూ, అచ్చు పని నాగిరెడ్డి గారూ అన్నట్లుగా ఎవరి పని వాళ్ళు చూసుకుండేవారు. ఒకరి పనిలో ఒకరు కల్పించుకునేవారు కాదట. చందమామ మొదలైన రెండు సంవత్సరాలకే "విజయా ప్రొడక్షన్ " ప్రారంభం అయింది. సినిమా నిర్మాణం వైపు చక్రపాణి గారు వెళ్లినప్పటికీ చందమామ పనులు ఏమాత్రం అశ్రద్ధ చేసేవారు కాదట. 1952 లోనే దాసరి సుబ్రహ్మణ్యం గారూ, అదే సంవత్సరం కొడవటిగంటి కుటుంబరావు గారూ చందమామ సంపాదక వర్గంలో చేరారు. పేరుకి సంపాదకుడు చక్రపాణి గారే అయినా, తాను చేరాక కొడవటిగంటి కుటుంబరావు గారు పూర్తి స్థాయి సంపాదకత్వం బాధ్యతలు చేపట్టారు.

1952 నుంచి ఆయన చనిపోయిన 1980 దాకా కొడవటిగంటి కుటుంబరావుగారు తన జీవితాన్ని చందమామ పత్రికకు అంకితం చేశారు. అలాగే దాసరి సుబ్రహ్మణ్యం గారు కూడా 54 సంవత్సరాల పాటు 1952 నుండి 2006 వరకూ చందమామ లో పనిచేశారు. ఇంకా చందమామ సంపాదకత్వ విభాగంలో పని చేసినవాళ్లు.

విశ్వనాథంగారూ, ఆలూరి బైరాగి గారూ మొదలైన వాళ్ళు. అట్లాగే బి. నాగిరెడ్డి గారు తన తర్వాత, చందమామ ప్రచురణ బాధ్యతల్ని వాళ్ళ అబ్బాయి విశ్వనాధ రెడ్డి గారికి బదిలీ చేశారు. 2011 లో ప్రయివేట్ సంస్థ వాళ్ళు కొనుగోలు చేసేవరకూ చందమామ పబ్లిషింగ్ బాధ్యతల్ని తండ్రిగారి బాటలోనే విలువలతో నిబద్ధతతో, కొనసాగించారు విశ్వంగారు.

చందమామ పత్రికలో కథలూ, సీరియల్సూ శైలీ వీటి గురించి మాట్లాడుకుందాం.

చందమామను జాగ్రత్తగా, దగ్గరగా గమనించిన వాళ్లకి ఒక విషయం తెలుస్తుంది. అందులో కథలుగానీ, సీరియల్స్ గానీ రచయిత ఎవరైనా శైలి ఇంచుమించు ఒకేలాగా ఉంటుంది. చిన్నచిన్న వాక్యాలు. ఎక్కడా గందరగోళంలోని సన్నివేశాలు. రచయితల పేర్లు తీసేస్తే, దాదాపు అన్ని ఒక్కరే రాశారా?అన్నట్లుగా ఉంటాయి. నిజంగా అంతే నండి. ఒక్కరే రాశారు. ఎలాగంటే, చందమామకు వచ్చే రచనలు అన్నీ కూడా సరళ వ్యవహారిక భాషలో ఉండేలాగా, ఏకరీతిలో సాగేలాగా సంపాదకత్వ శాఖవాళ్ళు తిరగ రాస్తూండేవాళ్లు.

మొట్ట మొదట్లో చక్రపాణి గారూ, తరవాత దాసరి సుబ్రహ్మణ్యం గారూ, కొడవటిగంటి కుటుంబరావు గారూ ఈ పని చేస్తుండేవారు. కొన్ని సార్లయితే, ఆ వచ్చిన రచనల్లో కథాంశం గనక నచ్చితే, పాత్రలూ, సంఘటనలూ మార్చేసి, కథను పూర్తిగా తిరగరాసిన సందర్భాలు కూడా ఉండేవట. చందమామ విజయానికి పిల్లల్నీ, పెద్దల్నీ ఒకే లాగా అలరించడానికి ఇదీ ఇది ఒక కారణం అని చెబుతారు విశ్లేషకులు.

ఇక చందమామ లోని కొన్ని ప్రజాదరణ పొందిన రచనల విషయానికి వస్తే, అన్ని రకాలైన కథలూ ప్రచురించేవారు. నీతి కథలూ, అద్భుత కథలూ, జానపద కథలూ, సాహస కథలూ, సమస్యాత్మక కథలూ, ఇంద్రజాల కథలూ, చారిత్రాత్మక కథలూ, వైజ్ఞానిక కథలూ ఇలా... అసలు చందమామలో స్పృశించనటువంటి కథల విభాగం ఉంటుందా ? అని పిల్లలకు అన్ని రంగాలకు సంబంధించిన కథలూ అందిస్తుండేవారు. అలాగే పురాణ ఇతిహాసాల నుండి ప్రపంచంలోని ఇతర భాషల్లోని కథల నుంచి, ఉపనిషత్తుల నుంచి ఇలా .. అన్నిటికి సంబంధించిన కథలు అందిస్తుండేవారు.

చందమామ పత్రికకు మరో ప్రత్యేక ఆకర్షణ అందులో వచ్చే సీరియల్స్. మొట్టమొదట్లో వచ్చే సీరియల్స్. తండ్రీ కొడుకులూ, దొంగ సన్యాసి, బాల నాగమ్మ, అయిదు ప్రశ్నలు ఇలాంటివి. ఇవన్నీ ఒక ఎత్తయితే, 1954 జనవరిలో ప్రారంభం అయింది “తోక చుక్క”అనే సీరియల్. అది చందమామ యొక్క సర్క్యులేషన్ ని విపరీతంగా పెంచిందట. ఆ సీరియల్ రాసింది దాసరి సుభ్రమణ్యం గారు. ఆ కోవలోనే తరవాత వచ్చిన సీరియల్స్ “మకర దేవత”, ముగ్గురు మాంత్రికులు, భువన సుందరి, జ్వాలా ద్వీపం, రాకాసి లోయ, ఇలాంటివన్నీ కూడా పిల్లల్నీ, పెద్దల్నీ ఏకరీతిలో అలరించాయి. చందమామ పత్రిక సర్క్యులేషన్ ని ఆకాశానికి అందుకునేలాగా చేసాయి.

ముఖ్యంగా చందమామ కథలన్నిటినీ గమనిస్తే ప్రతి దాంట్లోనూ ఏదో ఒక నీతి వుంటుంది. అంటే, చిట్ట చివరకు మంచే జయిస్తుందనీ, దురాశా, అసూయా,అహంకారం క్రూరత్వం ఇలాంటి నెగెటివ్ భావాలూ ఎప్పటికీ కూడా గెలవవు అని, బలవంతుడు అనేవాడు, బలహీనుడికి సహాయం చెయ్యాలని అలాగే ధనవంతుడు, ధనం లేని వాడికి సహాయం చెయ్యాలని ఇలా నీతుల్ని చిన్న చిన్న కథల రూపంలో అందిస్తుండేవారు. అంటే, కేవలం కాలక్షేపానికి కాకుండా, పిల్లలకు ఉపయోగపడేలాగా వుండాలి అని ప్రతి కథ గురించి కూడా చందమామ సంపాదకవర్గంలోని ప్రతి వాళ్ళు కూడా కసరత్తు చేస్తుండేవారు.

అలాగే చందమామలో కొన్ని దశాబ్దాలలో రాసిన కొంతమంది రచయతల గురించి తెలుసుకోవాలంటే, ఆంధ్రుల ఆహ్లాద రచయత మల్లాది వెంకట కృష్ణ మూర్తి తొలి కథ 1970 లో ఆయన 21 సంవత్సరాల వయసులో రాసిన మొదటి కథ చందమామలోనే ప్రచురితమయింది. ఆ తర్వాత చాలా కథలు వచ్చాయి. అలాగే ప్రముఖ రచయత, రచయిత్రుల జంట “వసుంధర” గారు చందమామలోనే దాదాపుగా 5,6 వందల కథలు రాసారు. చందమామలో వచ్చిన దయ్యాలూ, పిశాచాలూ దశాబ్దాల పాటు వచ్చిన ప్రత్యేకత మాచిరాజు కామేశ్వరావు గారు అనే ఆయనకు దక్కుతుంది.

చందమామ గురించి మాట్లాడుకునేటప్పుడు మరొక విషయం మనం ప్రత్యేకంగా ప్రస్తావించుకోవాలి. చందమామలోని రచనలు ఎంత విలక్షణంగా వుండేయో, చందమామలోని రచనలను అత్యంత ఆకర్షణీయం చేసినవి, కథలకు దృశ్యరూపం ఇచ్చినటువంటి వర్ణ చిత్రాలు. చందమామ విజయంలో అధిక శాతం ఈ వర్ణ చిత్రాలకు దక్కాలి అనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. చందమామను తన కుంచె బలంతో నడిపించిన చిత్రకారుల్లో కొంతమంది గురించి క్లుప్తంగా తెలుసుకుందాం. ముఖ్యంగా కవర్ పేజీకి, వెనుక అట్ట మీదా, లోపల సీరియల్స్ కీ బొమ్మలు వేసిన వడ్డాది పాపయ్య గారు వేసిన చిత్రాలు చాలా ప్రత్యేకంగా ఉండేవి. అలాగే “M. T .V. ఆచార్య “ ఆయన బొమ్మలు 1952 నుండి చాలా దశాబ్దాల పాటు బొమ్మలు వేస్తుండేవారు. ఆయన మహాభారతం అట్ట చివరి బొమ్మకూ, వేసేవారు. ఆ మహా భారతం 20 ఏళ్ళ పాటు కొనసాగింది. ఆ 20 ఏళ్ళు ఆయనే వేశారు. ప్రత్యేకత ఏమిటంటే, అందులో వచ్చేటటువంటి పాత్రలు ధర్మ రాజూ, భీముడూ, అర్జునుడూ వీళ్ళందరికీ మీసాలే ఉండేవి. అందరూ ఒక రకమైన మేకప్పే వేసుకునేటట్టే ఉండేవారు. కానీ, బొమ్మ చూడగానే ఈయన ధర్మరాజు, ఈయన అర్జునుడూ, ఈయన భీముడూ అని విభిన్నంగా తెలిసిపోతుంది. అలా 25 ఏళ్ళ పాటు కొనసాగించారు. ఆ M.T.V ఆచారి గారు. అలాగే భీష్మడికి ఆయన వేసినటువంటి తెల్ల గడ్డమూ, తెల్ల జుట్టూ ఇవన్నీ చూసి, “భీష్మ”సినిమాలో N.T. R మేకప్ కూడా ఈ బొమ్మ చూసి చేశారు అనుకునేవారు.

తరువాత చిత్ర కారుడు "చిత్ర". అసలు పేరు "T.V .రాఘవ". ఈయన మెయిన్ ఆర్టిస్టుగా ఉండేవాడు. చందమామ మొట్ట మొదటి సంచిక దాని ముఖ చిత్రం గీసింది కూడా ఈ చిత్రా గారే. విచిత్రం ఏమిటంటే, ఈ చిత్రా, చిత్ర కళను ఎవరిదగ్గరా నేర్చుకోలేదు. ఆయన స్వంతంగా ప్రాక్టీస్ చేసుకొని బొమ్మలు వెయ్యడం ప్రారంభించాడు. కాకపోతే ఆయన మంచి ఫోటో గ్రాఫర్ . ఆయన చందమామ లోని సీరియల్స్ కి అద్భుతమైనటువంటి వర్ణ చిత్రాలు అందించారు. ఇప్పటికి కూడా చందమామ లోని సీరియల్ బొమ్మల కింద chitra అని ఉంటుంది.

అలాగే మరొక ప్రముఖ చిత్ర కారుడు "శంకర్". ముఖ్యంగా శంకర్ గురించి చెప్పుకోవాలంటే, విక్రమాదిత్య, బేతాళ కథలు. బేతాళుడు ఆవహించిన శవాన్ని భుజాన వేసుకొని ఒక చేత్తో కత్తి పట్టుకొని, చాలా చురుకైన కళ్ళతో ముందుకు అడుగు వేస్తున్నట్టుగా బొమ్మ ఉంటుంది. అది వేసింది శంకర్ గారే .

అలాగే బాపుగారు కూడా కొన్ని సంచికలకు బొమ్మలు వేశారు. ముఖ్యంగా ఆయన ఉత్పల సత్యన్నారాయణాచారి గారు గేయ కథలకు చక్కని బొమ్మలు వేశారు. అలాగే జయా, వీరా, రాజీ ... ఇలాంటి వాళ్ళందరూ కూడా చందమామలో వివిధ దశల్లో బొమ్మలు వేశారు.

ఇక చందమామ సృష్టించిన కొన్ని రికార్డుల గురించి మాట్లాడు కోవాలంటే, చందమామ ఒకానొక సమయంలో 17 భాషల్లో ప్రచురితమైంది. సర్క్యులేషన్ కూడా కొన్ని లక్షల్లో ఉండేది. తెలుగూ, తమిళం, కన్నడం, హిందీ, మలయాళం, మరాఠీ, గుజరాతీ, ఇంగ్లీష్ ఇలా... 17 భాషలు అంటే ఊహించుకోవచ్చు. భారతదేశంలో వున్న అనేక భాషల్లో ప్రచురితమవుతుండేది. అది ఉచ్చ స్థాయిలో వున్నప్పుడు.

అలాగే, ఇంగ్లీష్ లో చందమామను ప్రచురించినపుడు మరీ చిన్నపిల్లల కోసమని "జూనియర్ చందమామ" అని 5 నుండి 10 సంవత్సరాల పిల్లల కోసం ఇంగ్లీష్ ఎడిషన్ తో పాటుగా ఒక చిన్న పుస్తకం ఇచ్చేవారు. 1978లో చందమామను మొట్టమొదటి సారిగా ఒక అంతర్జాతీయ అంటే "సింహళ భాష "లో ప్రచురించడం ప్రారంభించారు. ఆ సంవత్సరంలోనే సంస్కృత భాషలో కూడా చందమామను వెలువరించారు. అంటే, మొట్టమొదటగా సంస్కృతంలో వచ్చిన పిల్లల పత్రిక చందమామే. ఆ తర్వాత కొన్ని సంవత్సరాలకి 1981 లో "అంతర్జాతీయ దివ్యాంగుల దినం " బ్రెయిలీ లిపిలో అంధుల కోసమని మూడు భాషల్లో విడుదల చేశారు. 2003 లో చందమామ ద్విభాషా పత్రికలు, అంటే, సింగపూర్ కోసమని ఇంగ్లీషు– తమిళు. అలాగే అమెరికా పాఠకుల కోసమని ఇంగ్లీషు–తెలుగు, ఇంగ్లీషు–తమిళు, ఇంగ్లీషు–హిందీ, ఇలాంటి ప్రయోగం కూడా మొట్ట మొదటిసారిగా చందమామే చేసింది. బహుశా చివరిసారి కూడా అదే అయి వుంటుంది.

ఇవి చందమామ సృష్టించిన కొన్ని రికార్డులు.

ఆ తరువాత చక్రపాణి గారు మరణించేవరకూ, నాగిరెడ్డి గారు కూడా గతంలో ఏ ఉద్దేశ్యాలతో ప్రారంభించారో. ఏ ఆశయాలతో ప్రారంభించారో ఏమాత్రం ఆ విలువలూ, ప్రమాణాలు తగ్గకుండా దశాబ్దాలుగా దాన్ని కొనసాగుతూ వచ్చారు. కార్మికుల సమ్మె, ఇంకా ఇతర కారణాల వల్ల 1998 లో ఒక సంవత్సరం పాటు చందమామ ఆగిపోయింది. అప్పటికి నాగిరెడ్డి గారు జీవిత చరమాంకంలో వున్నారు. ఇది తెలుసుకుని ఆయన కన్నీరు పెట్టుకున్నారట. మళ్ళా 1999 డిసెంబర్ లో పునః ప్రారంభం అయ్యాక, వాళ్ళ అబ్బాయి విశ్వం గారు చందమామ సంచికను తీసికెళ్ళి నాగిరెడ్డి గారి చేతుల్లో పెట్టినపుడు ఆప్యాయంగా పసిబిడ్డను చూసుకున్నట్టు, చూసుకున్నారట.

ఆ తర్వాత మరో 8 ఏళ్ల పాటు బాగానే నడిచింది. ఆ తరువాత 2007 లో ఒక ప్రైవేట్ సంస్థ వాళ్ళు చందమామను కొనుగోలు చేశారు గానీ, వాళ్ళు కూడా 5,6 సంవత్సరాలు మించి నడపలేకపోయారు. 60 సంవత్సరాలు పైగా తెలుగువారి మనసు లోగిళ్ళలో , నిరంతరం వెన్నెల వర్షం కురిపించిన చందమామ సుమారుగా 2013 ప్రాంతాలలో ముగిసింది.

ఇంకా చందమామ పత్రిక గురించి చాలా చెప్పుకోవచ్చు. కొన్ని గంటలపాటు, ఒక్కో సీరియల్ గురించి, కొన్ని కథల గురించి మాట్లాడుకోవచ్చు. కానీ, దేనికైనా ఒక ముగింపు ఉండాలి కదా! చందమామ గురించిన విశేషాలను ఇంతటితో ముగిద్దాం. ఇవి 1940 నుండి 1950 మధ్యలో ప్రారంభం అయిన కొన్ని పత్రికల గురించి తెలుసుకున్నాం. వచ్చే భాగంలో మరికొన్ని పత్రికల గురించి తెలుసుకుందాం.

అక్షరీకరణ – వి. వెంకటరావు

2020 సెప్టెంబర్ 16 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS